నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 30 మార్చి 2024 SIDDIPET


సిద్దిపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి


దుబ్బాకలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, వేదికపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

# కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చర్చపెట్టాలి

**వెంకట్రామిరెడ్డి సేవాగుణం ఉన్న వ్యక్తి ఆయనను గెలిపించాల్సిన బాధ్యత మనదే..**

## హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఓటేయవద్దని ప్రజలను చైతన్యపర్చాలి

- కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి
- సిద్దిపేట అంటే కాంగ్రెస్ వాళ్లకు గిట్టదు
- సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు


ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న ఆటో కార్మికులు

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, మార్చి 29: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీ అయినోళ్లు, రూ.4 వేల పింఛన్, వరి ధాన్యానికి రూ.500 బోనస్, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు, మహిళలకు నెలకు రూ.2500 వచ్చిన వాళ్లు కాంగ్రెస్‌కు, మిగతా వాళ్లందరూ బీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఈ విషయాలన్నీ కార్యకర్తలు గ్రామాల్లో చర్చ పెట్టాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు సిద్దిపేట అంటే కండ్లమంట అని.. అందుకే ప్రతిసారి సిద్దిపేట మీద విషం చిమ్మారన్నారు. అలాంటి వారికి ఓటు వేసి మన కండ్లను మనమే పొడుచుకుందామా.. అని ప్రశ్నించారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి కోసం తాను ఎంతో కష్టపడి పనిచేశానని, ఈ జిల్లాను ఓర్వలేని వారు మనకు ఏం న్యాయం చేస్తారని హరీశ్‌రావు అన్నారు. ఈ జిల్లాలో ప్రతి మూల తెలిసిన వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని.. పార్లమెంట్‌లో మనకోసం గళం విప్పి మన మెదక్ జిల్లాకు న్యాయం చేయగలిగే వ్యక్తి ఆయన అన్నారు. మాయమాటలు చెప్పి దుబ్బాక ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు, మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఓడగొట్టారో చెప్పాలన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడి.. ఇచ్చిన హామీలు నెరవేరిస్తే దుబ్బాక ప్రజలు ఎందుకు ఓడగొట్టారో చెప్పాలన్నారు. ఒక్క సిద్దిపేట నియోజకవర్గంలో 200 దేవాలయాలు కట్టిచ్చామని.. కానీ, దేవుడి పేరు మీద రాజకీయం చేయలేదన్నారు. సిద్దిపేట ప్రజలే తన కుటుంబ సభ్యులుగా పనిచేశానని.. సిద్దిపేట ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని సిద్దిపేటలో 1000 పడకల దవాఖాన నిర్మించామని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చిన్నకోడూర్ రోడ్డును ఆపివేశారని, అలాగే వెటర్నరీ కళాశాల మంజూరు చేయిస్తే కొడంగల్‌కు తరలించారన్నారు. సిద్దిపేటకు రాకుండా ఇన్ని ఆపిన కాంగ్రెస్‌కు ఓటుతో సమాధానం చెప్పాలని కోరారు. ఇవన్నీ గ్రామాల్లో చర్చ పెట్టాలన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడే వాడే నిజమైన కార్యకర్త అన్నారు. సిద్దిపేట అంటే, మెదక్ అంటే రాష్ట్రంలో ఒక గౌరవం ఉందని.. ఆ గౌరవాన్ని, ప్రతిష్టను కాపాడాలన్నారు. తండ్రి లాంటి కేసీఆర్‌కు అండగా ఉండాల్సిన సమయం ఇదే అన్నారు. వెంకట్రామిరెడ్డి మంచి మాట చెప్పారని.. కార్యకర్తలు, ప్రజల కోసం సేవ చేసేందుకే విద్యానిధి కింద ట్రస్ట్ ఏర్పాటు చేస్తానని చెప్పారన్నారు. కార్యకర్తల పిల్లల కోసం ఫంక్షన్‌హాళ్లను నిర్మించి ఉచితంగా వాడుకునేందుకు ఇప్పిస్తా అని చెప్పారన్నారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి దొరకడం మన అదృష్టమని, ఆయనను గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను తెలంగాణ ప్రజలను ఎవరూ కొనలేరన్నారు. ఎక్కడ పోరాటం ఉన్నా.. ఎక్కడా ఉద్యమం ఉన్నా సిద్దిపేట కార్యకర్తలు కష్టపడి కొట్లాడిన చరిత్ర ఉందని గుర్తుచేశారు. తన ఎన్నిక కోసం ఎలా కష్టపడ్డారో, వెంకట్రామిరెడ్డి ఎన్నిక కోసం కూడా కార్యకర్తలు అలాగే కష్టపడాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి, ఫరూఖ్ హుస్సేన్

### జోష్ నింపిన కార్యకర్తల సమావేశం


వెంకట్రామిరెడ్డిని ఎత్తుకున్న కార్యకర్తలు

సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సిద్దిపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశం క్యాడర్‌లో జోష్ నింపింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను వీడియో రూపంలో ప్రజలకు వివరించిన సమయంలో ప్రజలు చప్పట్లు కొట్టారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తన ప్రస్థానం గురించి, తను భవిష్యత్‌లో చేసే సేవల గురించి వివరించినప్పుడు కార్యకర్తలు ఒకింత ఎమోషనల్ కాగా.. ఆయనను సమర్థిస్తూ ఈలలు వేసి జోష్ నింపారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ వంగ నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పూజల వెంకటేశ్వర్‌రావు(చిన్నా), వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దుబ్బాక గడ్డ.. బీఆర్ఎస్ అడ్డ

## ఎన్నిక ఏదైనా దుబ్బాకలో బీఆర్ఎస్‌దే గెలుపు

- హామీలు విస్మరించిన రఘునందన్ ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతుండు..
- బీజేపీ చేసిందేమీ లేదు..
- గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నించే గొంతుకలు కావాలి...ప్రజల కోసం ఎంతకైనా తెగించాలి
- కష్టకాలంలో అండగా ఉన్నవారికి పార్టీలో సముచిత స్థానం
- దుబ్బాకలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

దుబ్బాక/ దుబ్బాక టౌన్, మార్చి 29 : దుబ్బాక ప్రాంతం మొదటి నుంచి బీఆర్ఎస్‌కు అండగా నిలిచిందని, ఇక్కడ ఏ ఎన్నిక జరిగినా గెలుపు బీఆర్ఎస్‌దే అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం దుబ్బాకలో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన సమావేశానికి అన్ని మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతూ... హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్ పార్టీని, తెలంగాణకు ఏమిచేయని బీజేపీని ఎంపీ ఎన్నికల్లో బొంద పెట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి కొన్ని ఒడిదొడుకులు సహజమని, వాటన్నింటినీ అధిగమించి నిలబడతామని భరోసా ఇచ్చారు. కొంతమంది పోలీసులు, కొంతమంది అధికారులు ఎక్కువ చేస్తున్నారని, అన్నీ గమనిస్తున్నామన్నారు. నాడు తమ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లోనే నిమగ్నమైందే తప్పా ఎలాంటి చిల్లర విషయాల్లో జోక్యం చేసుకోలేదన్నారు.

**మోసం చేయడమే కాంగ్రెస్ నైజం..**

బీజేపీ పాలనలో రూపాయి విలువ పడిపోవడం, పేదరికం పెరిగిపోవడం, రైతులను రోడ్ల మీదికి రప్పించడం జరిగినవి తప్పా చేసిన గొప్ప పనులు ఏమీ లేవని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణకు బీజేపీ సర్కారు పైసా పనిచేయలేదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ఎడ్లు, బండి ఇవ్వని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పార్లమెంట్‌కు పోయి ఏమి ఉద్ధరిస్తాడని ఎద్దేవా చేశారు. దుబ్బాక ప్రజలు ఓడించినా ఆయనకు బుద్ధిరాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారాల హామీలను ఒక్కొక్కటిగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఎల్ఈడీ స్క్రీన్‌లో పార్టీ శ్రేణులకు చూపిస్తూ వారి మోసపూరిత మాటలను ఎండగట్టారు. పార్టీ శ్రేణులు సైతం ఇదే తరహాలో ప్రజలకు వివరించాలని కోరారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీది అసత్య ప్రచారమే. అబద్ధాలతో అధికారం అందుకున్న కాంగ్రెస్ వంద రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. 'పంటలు ఎండిపోతున్నాయి...కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు...కరెంట్ సమస్యలు పెరుగుతున్నాయి. వీటికి సమాధానాలు ఏమిటి. బీఆర్ఎస్ శ్రేణులే నడుం బిగించాలి. ప్రశ్నించే గొంతుకలు కావాలి. బీఆర్ఎస్‌తోనే కాంగ్రెస్ బోగస్ ప్రచారానికి పడాలి'..అని పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని కార్యకర్తలు, ప్రజలు, నాయకులు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్, బీజేపీ ఆడే నాటకాల్లో భాగస్వాములు కావద్దన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ రోజా శర్మ , బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి, ఎంపీపీ పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ బాలకిషన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, కోమటిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, మనోహర్‌రావు, రణం శ్రీనివాస్ గౌడ్, రాంరెడ్డి, రవి, బానాల శ్రీనివాస్, వంశీకృష్ణ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, యాదవరెడ్డి, ఫరూఖ్ హుస్సేన్

### వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం..

మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపులో దుబ్బాక ప్రాంతం ప్రధాన పాత్ర పోషించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. 2001 నుంచి 24 ఏండ్ల ప్రస్థానంలో ప్రతి ఎన్నికల్లోనూ దుబ్బాక గడ్డ మీద బీఆర్ఎస్ జెండా ఎగిరిందన్నారు. ఒక్కసారి మాత్రం వెయ్యి ఓట్లతో దెబ్బతిని తిరిగి మేల్కొని 54 వేల ఓట్లతో దెబ్బ కొట్టితే బీజేపీ బొక్కబోర్లా పడిందన్నారు. దుబ్బాక ప్రతి తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిచిందని కరుడుగట్టిన ఉద్యమకారులు కేసీఆర్ వెంట నడిచి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. అదే స్ఫూర్తితో నేడు విద్యావంతుడైన వెంకట్రామిరెడ్డిని పార్లమెంట్‌కు పంపించి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని కోరారు. పేదలకు సేవచేసేందుకు ముందుకు వచ్చిన వెంకట్రామిరెడ్డికి రూ.వంద కోట్లతో విద్యానిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు.


కార్యకర్తలకు కరచాలనం చేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


సీడీని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డి


దుబ్బాకలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు


సిద్దిపేటలో సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



# లింగాపూర్‌కు నీళ్లొచ్చినయి..

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి29: ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో వారం రోజులుగా తాగునీరు లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'తాగునీళ్ల మహాప్రభో..!' అనే కథనాన్ని ప్రచురించడంతో మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ డీఈఈ వేణుగోపాల్ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ బండ బాలరాజు గ్రామంలోని మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు పర్యాయాలు నింపి, నల్లాల ద్వారా నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ లైన్‌లో ఏర్పడిన సమస్యతో గ్రామంలో తాగునీటి సమస్య ఉత్పన్నమైన మాట వాస్తవమేనని, రాబోయే రోజుల్లో గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్


లింగాపూర్‌లో మిషన్ భగీరథ నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

# నకిలీ అధికారి వెనకున్నదెవరు?!

## చర్చనీయాంశమైన అనిరుధ్ వ్యవహారం.. నవ్వుల పాలైన అధికారులు


సీసీఎల్ఏ అధికారినంటూ అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేస్తున్న అనిరుధ్ (ఫైల్)

అమీన్‌పూర్, మార్చి 29: సీసీఎల్ఏ అధికారినంటూ, సీఎం పేషీ నుంచి వచ్చానంటూ అమీన్‌పూర్‌లో వారం రోజుల పాటు హల్‌చల్ చేసిన నకిలీ అధికారి అనిరుధ్‌ను అమీన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కాగా, అతడు అమీన్‌పూర్ ప్రాంతంలో అనేక మంది అధికారులు, బిల్డర్లను, అధికారులకు నిద్రపోకుండా చేయడం గమన్హారం. రెవెన్యూ పరమైన అంశాలపై ఉన్న అవగాహనతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారుల వద్ద హల్‌చల్ సృష్టించాడు. తాను సీఎం రేవంత్‌రెడ్డి పేషీ ప్రత్యేకాధికారినని, అక్కడి నుంచి వచ్చానంటూ భూరికార్డులు అందచేయాలని ఏకంగా అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులకు హుకుం జారీచేశాడు. అక్రమ నిర్మాణాలు,ప్రభుత్వ భూముల అక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్ భూములు, నాలాలకు సంబంధించి పూర్తి అవగాహనతో మాట్లాడి అధికారులను బోల్తా కొట్టించాడు. అతడి తీరుతో స్థానిక అధికారులు ఆందోళనలకు గురయ్యారు. పూర్తి రికార్డులు అతడికి ఇవ్వడంతో పాటు అతడి వెంట క్షేత్రస్థాయిలో సర్వేకు సైతం అధికారులు వెళ్లడం విశేషం. అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ పంచాయతీలో స్థానిక అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమ నిర్మాణాలంటూ జేసీబీ వెంట తీసుకెళ్లి మరీ రెండు భవనాలను కూల్చివేయించడం విశేషం. అమీన్‌పూర్ పోలీసులు అనిరుధ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ అధికారి అని తేలింది. ఈ వ్యవహారం అమీన్‌పూర్ మండలం, మున్సిపాలిటీలోనే కాకుండా ఉమ్మడి మెదక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అనిరుధ్ కొంతకాలం సీసీఎల్ఏ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేసి రెవెన్యూ వ్యవహారాలపై పూర్తి అవగాహన పెంచుకున్నట్లు తెలిసింది. దీంతో అతడ్ని అడ్డుగా పెట్టుకుని అమీన్‌పూర్‌లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు, బిల్డర్లను బ్లాక్ మెయిల్ చేసి సొమ్ము చేసుకునేందుకు అతడి వెనకాల ఉండి ఓ స్థానిక న్యాయవాది ఈ తతంగం నడిపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు విచారణ చేపడితే అసలు దొంగలు బయటకు వస్తారని, అందువల్ల ఫేక్ అధికారులు పుట్టుకురారని పేర్కొంటున్నారు. వారం రోజులుగా అనిరుధ్ సీసీఎల్ఏ ఫేక్ అధికారిగా అవతారమెత్తి అనేక కార్యాలయాలు, అధికారులను భయాందోళనకు గురిచేసినా ఏ ఒక్క అధికారి కనిపెట్టలేకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ ఘటన అధికారులను నవ్వులపాలు చేసిందని చెప్పవచ్చు.


అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అనిరుధ్